సాక్షి తిరుపతి

ఆదివారం । 10 । సెప్టెంబర్ । 2023



ప్రాణం తీసిన కునుకు

కునుకు ఇద్దరి ప్రాణాలను తీసింది. ఈ విషాద ఘటన శుక్రవారం రాత్రి శ్రీసిటీ పారిశ్రామిక వాడలో చోటుచేసుకుంది.


- IIలో



టీ-20 జిల్లా జట్టు ఎంపిక

పాకాల మండలంలోని దామలచెరువు జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో టీ-20 జిల్లా జట్టును ఎంపిక చేశారు.

- IIలో



హాయ్ మిత్రమా?

సూళ్లూరుపేట: ఈ ఏడాది జులై 14న ప్రయోగించిన చంద్రయాన్-3 మిషన్‌లోని ల్యాండర్ (విక్రమ్)ను 2019లో జులై 22న ప్రయోగించిన చంద్రయాన్-2 మిషన్ ఈనెల 6న క్లిక్‌మనిపించింది.

గురుదేవోభవ



భారతీయ సంస్కృతిలో గురువు స్థానం ఎంతో విశిష్టమైనది. సమున్నతమైనది. గౌరవప్రదమైనది. తల్లిదండ్రుల తరువాతి స్థానం గురువుది. అలాంటి గురువులను సన్మానించుకోవడం నా అదృష్టం.. పూర్వజన్మ సుకృతం' అని తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు.

-- IIలో

రెచ్చగొట్టినా.. గప్‌చుప్



'ముప్ఫై ఏళ్లు ఎమ్మెల్యేగా.. పద్నాలుగేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేశా. చిన్న మచ్చలేకుండా పాలించానంటూ..' ఊకదంపుడు ప్రసంగాలతో ప్రజలను మభ్యపెట్టే నారా చంద్రబాబునాయుడు అడ్డంగా బుక్కయ్యారు. స్కిల్‌డెవలప్‌మెంట్ స్కామ్‌లో ఏ–1 ముద్దాయిగా పట్టుబడ్డారు. శనివారం చంద్రబాబు నాయుడును సీఐడీ అధికారులు అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో తన సొంత జిల్లా ప్రజల రియాక్షన్‌పై ఆసక్తిగా ఎదురు చూశారు. కానీ జిల్లాలో ఏ ఒక్కరూ స్పందించ లేదు. కనీసం ఆందోళనలు చేయడానికి పట్టుమని పది మంది కూడా ముందుకు రాలేదు. పచ్చకాలర్ నేరస్తుడికి ఏ ఒక్కరూ మద్దతు పలకలేదు. పనిలోపనిగా ఆ పార్టీ ముఖ్యనేతలు కొందరు మెసేజ్‌ల మీద మెసేజ్‌లు పెట్టి రెచ్చగొట్టినా టీడీపీ సానుభూతిపరులు డోంట్‌కేర్ బాబు! అంటూ మిన్నకుండిపోయారు. ఇప్పటికే పుంగనూరు ఘటనతో ఉక్కిరిబిక్కిరవుతున్న టీడీపీ కార్యకర్తలు ఆ మెసేజ్‌లు చూసినా.. తేలుకుట్టిన దొంగల్లా ఉండిపోవడం గమనార్హం.

- బాబు అరెస్ట్.. పట్టించుకోని కార్యకర్తలు
- బస్సులు ఆపినా.. ఎవరి పనుల్లో వారు బిజీబిజీ
- యథావిధిగా కార్యక్రమాలు, వాహనాల రాకపోకలు
- జనాన్ని భయపెట్టేందుకు టీడీపీ శ్రేణులు టైర్లు తగులబెట్టిన వైనం

సాక్షి, తిరుపతి: నారా చంద్రబాబు నాయుడు అరెస్టుని సొంత జిల్లా వాసులు ఏ మాత్రం పరిగణలోకి తీసుకోలేదు. టీడీపీ శ్రేణులు వాట్సాప్‌ల ద్వారా.. ఫోన్ల ద్వారా బంద్‌కు పిలుపునిచ్చినా స్థానికుల నుంచి స్పందన రాలేదు. కనీసం పార్టీలో ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులైనా రోడ్డుపైకి వచ్చి నినాదాలు చేస్తారని ఎదురుచూసినా ఫలితం లేదు. జిల్లాలోని టీడీపీ ముఖ్యనేతలు తీవ్ర నిరుత్సాహానికి లోనయ్యారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో పక్కా ఆధారాలతో అడ్డంగా దొరికిపోయిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని శనివారం సీఐడీ పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. చంద్రబాబు అరెస్టు విషయాన్ని టీడీపీ ముఖ్యులు పార్టీ శ్రేణులకు సమాచారం ఇచ్చారు. ఎక్కడికక్కడ పెద్ద ఎత్తున నిరసనలు తెలిపి బంద్ చేపట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర టీడీపీ కార్యాలయం నుంచి అందిన ఆదేశాలను పాటించేందుకు జిల్లా టీడీపీ నేతలు శతవిధాలా ప్రయత్నాలు చేశారు. చంద్రబాబు అరెస్టుతో పోలీసులు జిల్లా నాయకులను హౌస్ అరెస్టు చేశారు. దాంతో సెల్‌ఫోన్ల ద్వారా, వాట్సాప్ ద్వారా టీడీపీ శ్రేణులకు సమాచారం ఇచ్చారు. 'నంద్యాలలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడిని అరెస్టు చేశారు. మమ్మల్ని హౌస్ అరెస్టు చేశారు. నాయకులు, కార్యకర్తలు రోడ్లపైకి చేరుకుని నిరసనలు చేయండి. వాహనాలను ధ్వంసం చేయండి. వీలైతే ఒకటి రెండు వాహనాలను తగులబెట్టండి. ఒక్క వాహనం కూడా తిరగకుండా చేయండి. లేదంటే సొంత జిల్లాలోనే చంద్రబాబు నాయుడికి విలువ ఉండదు' అని వాట్సాప్ మెసేజ్‌లు పెట్టారు.

స్పందించని టీడీపీ శ్రేణులు

చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో పోలీసులు ముందస్తు చర్యల్లో భాగంగా జిల్లాకు చెందిన ముఖ్యమైన నాయకులందరినీ హౌస్ అరెస్ చేశారు. ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలని యథాతథంగా తిరుగుతూనే ఉన్నారు. వారందరికీ టీడీపీ నాయకులు పంపిన మెసేజ్‌లు చూసినా స్పందించలేదు. 'అధికారంలో ఉన్నన్ని రోజులు సంపాదించుకున్నారు. ఆ టైంలో పార్టీ కోసం కష్టపడిన మనకు గుర్తింపు ఇవ్వలేదు. ఇప్పుడు గొడవలు చేయమంటున్నారు. నాయకులు మాత్రం ఇంట్లో కూర్చుంటే.. తాము మాత్రం చెప్పినట్లు గొడవలు చేసి జైలుకు వెళ్లాలా? నాయకుల మాటలు విని పుంగనూరులో చేసిన విధ్వంసానికి కార్యకర్తలు కొందరు తగిన శిక్ష అనుభవిస్తున్నారు. అలా మనమెందుకు బలికావాలి.' అంటూ ఎవ్వరూ ఆందోళనలు చేయడానికి ముందుకు రాలేదు.

జనం కూడా పట్టించుకోలేదు

పద్నాలుగేళ్లు సీఎంగా ఉన్నా సొంత జిల్లాకు ఏమీ చేయని చంద్రబాబుని అరెస్టు చేస్తే తామెందుకు బంద్ పాటించాలి.. అని స్థానికులు ఎవరి పనుల్లో వారు బిజీగా గడిపారు. ఏమి చేశారని షాపులు మూసుకోవాలి? అని అడిగిన వారికి స్థానికులు సమాధానం ఇవ్వడం కనిపించింది. అయితే ఒకటి రెండు చోట్ల నలుగురైదుగురు కార్యకర్తలు వాహనాల టైర్లు తెచ్చి నిప్పుపెట్టి హడావుడి చేశారు. ఓ పక్క టైర్లు కాలుతుంటే.. మరో వైపు నుంచి జనం వెళ్లిపోవడం కనిపించింది. 'చంద్రబాబు నాయుడిని అరెస్టు చేశారు.. మీకు బాధ్యత లేదా? అని ప్రశ్నిస్తుంటే.. స్థానికులు చూసీచూడనట్లు వెళ్లిపోవడం గమనార్హం.

కక్ష సాధింపు లేదు



సుదీర్ఘ పరిశోధనల తర్వాతే చంద్రబాబునాయుడును అరెస్ట్ చేశారు. ఇందులో కక్ష సాధింపు చర్యలు ఉండవు. డొల్ల కంపెనీలను అడ్డుపెట్టుకొని యువతలో స్కిల్ డెవలప్‌మెంట్ అంటూ వందల కోట్ల రూపాయల సొమ్ము దోచేశారు. ఇదే విషయాన్ని ఐటీ శాఖ తేల్చింది. రెండేళ్ల క్రితమే కేసును నమోదు చేసి, ఆధారాలతో చట్టపరంగానే సీబీసీఐడీ అరెస్ట్ చేసింది.

– కోనేటి ఆదిమూలం, ఎమ్మెల్యే, సత్యవేడు

కుటిల బుద్ధి బయటపడింది



చంద్రబాబు కుటిల బుద్ధి బయటపడింది. ఆయన అవినీతి బాగోతం బట్టబయలైంది. ఐటీ అధికారులు నాలుగు నోటీసులు ఇచ్చినా చంద్రబాబు స్పందించలేదు. ఆధారాలు దొరికాయి. అందుకే అరెస్ట్ చేశారు.

– వరప్రసాద్‌రావు, ఎమ్మెల్యే, గూడూరు

అవినీతి సామ్రాట్ బాబు



చంద్రబాబు అవినీతి సామ్రాట్. ఆయన వ్యవస్థలను మేనేజ్ చేయడంలో దిట్ట. ఈ రోజు పాపం పండింది. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో కోట్ల రూపాయల అవినీతి బయటపడింది.

– కిలివేటి సంజీవయ్య, ఎమ్మెల్యే, సూళ్లూరుపేట

ప్రధాన సూత్రధారి బాబు



ప్రభుత్వ సొమ్ము అవినీతికి పాల్పడిన కేసులో చంద్రబాబు అరెస్టయ్యారు. ఆయన స్కిల్ స్కామ్‌లో ప్రధాన సూత్రధారి. టీడీపీ హయాంలోనే దీనిపై విచారణ మొదలుపెట్టారు. ఇందులో కక్ష సాధింపు ఏమీలేదు.

– మేరిగ మురళీధర్, ఎమ్మెల్సీ

సీమెన్స్ స్కీమ్..పెద్ద స్కామ్



చంద్రబాబు నాయుడు ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా సీమెన్స్ కంపెనీ పేరుతో చేసిన స్కీమ్ పెద్ద స్కామ్. రాష్ట్ర ప్రజాధనం రూ.370 కోట్లు దుర్వినియోగమైంది. అప్పటి ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఎండీ గంటా సుబ్బారావు, విశ్రాంత ఐఏఎస్ అధికారి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఈ తతంగం నడిచింది. ఈ స్కామ్‌లన్నీ 2014 నుంచి 2019 మధ్య సాగినవే. సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎవరిపై కక్షసాధింపు చర్యలకు పాల్పడడం లేదు.

– నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

ఇంటర్నేషనల్ దొంగ చంద్రబాబు



ఇంటర్నేషనల్ దొంగ చంద్రబాబు. జేబు దొంగ నెలకు దొరుకుతాడు.. చంద్రబాబు అనే దొంగ మాత్రం నలభై ఏళ్ల తరువాత దొరికాడు. డబ్బు ఎంత దోచుకున్నా అరెస్ట్ చేయకూడదా?. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని అరెస్ట్ చేసినప్పుడు చట్టం తనపని తాను చేసుకుని పోతుంది అని చంద్రబాబు అన్న మాటలను గుర్తుకు రాలేదా..? **– బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్యే, శ్రీకాళహస్తి**

అలిపిరి ఘటనలో రాని సానుభూతి..

అరెస్టుతో వస్తుందా?

- హత్యలు, అవినీతితోనే బాబు కాపురం
- రాజకీయాలకు అనర్హుడిగా ప్రకటించాలి
- బాబుకి వెన్నుపోటు.. పన్నుపోటు మాత్రమే తెలుసు
- పవన్ అవినీతికి మద్దతుగా నిలిచారన్నది తేలిపోయింది



మాట్లాడుతున్న భూమన కరుణాకరరెడ్డి

సాక్షి, తిరుపతి: 'అలిపిరి ఘటనతో రాని సానుభూతి.. అరెస్టుతో వస్తుందా..?' అని టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ప్రశ్నించారు. చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో ఆయన నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. అలిపిరిలో చంద్రబాబుపై నక్సల్స్ క్లైమోర్‌మెన్ బాంబు దాడి, హత్యాయత్నం చేస్తే.. దగ్గరలో ఉన్న టీ షాపు వాడు కూడా సానుభూతి చూపలేదని, ఆ మరుసటి రోజు దివంగత నేత వైఎస్.రాజశేఖరరెడ్డి, తాను నిరసన తెలిపామని గుర్తుచేశారు. ఇండియా కూటమి దుర్మార్గం పక్షాన నిలబడిందన్నారు. చంద్రబాబుకు వెన్నుపోటు, పన్నుపోటు మాత్రమే తెలుసని చెప్పారు. ఆయన రాజకీయ జీవితం అంతా హత్యలు, అవినీతి, కుట్రలు, కుతంత్రాలతోనే కాపురం చేశారని విమర్శించారు. జనం సొమ్ముతిన్న వ్యక్తిని అరెస్టు చేస్తే ధర్మమా అని కొందరు ప్రశ్నించడం శోచనీయమన్నారు. వ్యవస్థలను మేనేజ్ చేసి ఎవ్వరినైనా లోబరచుకోగల సమర్థుడు చంద్రబాబు అని చెప్పారు.

చంద్రబాబు అరెస్ట్‌ను ప్రజలు స్వాగతిస్తున్నారు

చంద్రబాబు అరెస్టును ప్రజలంతా స్వాగతిస్తున్నారని టీటీడీ చైర్మన్ తెలిపారు. ఒక్క ఫైల్‌పై కూడా సంతకం చేయని వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని సోనియాతో కలిసి సీబీఐని ఉసిగొల్పి అక్రమంగా అరెస్టు చేసిన వ్యక్తి చంద్రబాబు కాదా? అని ప్రశ్నించారు. చంద్రబాబు అరెస్టు ప్రతీకార చర్య కాదని, నేరం చేసిన వ్యక్తికి పడే శిక్ష అని పేర్కొన్నారు. రాజకీయాలకు అనర్హుడు అని ప్రకటించాలని భూమన డిమాండ్ చేశారు. అవినీతి పరుడైన బాబుకు మద్దతుగా నిలిచి సానుభూతి చూపుతున్న పవన్, కమ్యూనిస్టులను ప్రజలు విశ్వసించరని తేల్చిచెప్పారు.

క్లుప్తంగా

వానదేవుడా కరుణించు!

- సమృద్ధిగా వర్షాల కోసమే వరుణ యాగం
- టీటీడీ ఈఓ ఏవీ.ధర్మారెడ్డి



పూజా సామగ్రితో వెళ్తున్న టీటీడీ ఈఓ ధర్మారెడ్డి

చంద్రగిరి: సకలజన సౌభాగ్యాన్ని ఆకాంక్షిస్తూ, అందుకు అత్యంత అవసరమైన వరుణదేవుని అనుగ్రహం సమృద్ధిగా ఉండాలని అభిలాషిస్తూ, సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి దేశం, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని శ్రీవారిని ప్రార్థిస్తూ టీటీడీ వరుణ యాగానికి శ్రీకారం చుట్టినట్లు ఈఓ ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. శనివారం శ్రీనివాసమంగాపురం ఆలయంలో అష్టోత్తర శత కుండాత్మక మహా శాంతి వరుణ యాగాన్ని శాస్త్రోక్తకంగా నిర్వహించారు. తొలి రోజు వాస్తుహోమం, అకల్మషహోమం, పంచగవ్య ప్రాశనం, రక్షాబంధనం, గజపూజ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ రక్షాబంధనం, గజపూజలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. వాన దేవుడిని ప్రసన్నం చేసుకునేందుకు మూడు రోజులపాటు ఈ యాగం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో ప్రపంచ వాతావరణంలో ఈ ఏడాది, వచ్చే ఏడాది అతి తక్కువ వర్షాలు కురుస్తాయని వాతావరణ నిపుణులు తెలిపారన్నారు. శ్రీవారి అనుగ్రహంతో తిరుమల ధర్మగిరిలో ఆగస్టు 21 నుంచి 26వ తేదీ వరకు కరీరిష్టి వరుణజప మహాశాంతి యాగం నిర్వహించినట్లు వెల్లడించారు. సెప్టెంబర్ 11న గోపూజ, మహా పూర్ణాహుతితో ఈ యాగం ముగుస్తుందన్నారు. ఈ యాగంలో మూడు రాష్ట్రాలకు చెందిన 200 మందికి పైగా రుత్వికలు పాల్గొన్నట్టు తెలిపారు. టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం, ఆలయ స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు

టీ-20 జిల్లా జట్టు ఎంపిక

పాకాల: మండలంలోని దామలచెరువు జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో శనివారం టీ-20 జిల్లా జట్టును ఎంపిక చేశారు. టీ-20 అసోసియేషన్ కార్యదర్శి జీ.విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కే.అద్వైత్ ఆధ్వర్యంలో ఈ ఎంపిక జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివేక్, వియజ్, సంజయ్, జగత్‌కుమార్, నగేష్, ప్రశాంత్, దినేష్, మనోజ్, వినిత్‌కుమార్, జశ్వంత్, కే.దినేష్, సంతోష్‌కుమార్, మోహిత్‌కృష్ణ, నితిన్, అజయ్‌కుమార్, పరేరసన్ ఎంపికైనట్టు వెల్లడించారు. ఎంపికైన వారు ఈనెల 14 నుంచి 17వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరిగే టీ-20 క్రికెట్ నేషనల్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు.



హాజరైన ఉపాధ్యాయులు, అధ్యాపకులు



గురువులకు నూతన వస్త్రాలు, స్వీట్లు అందిస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జేసీ డీకే.బాలాజీ తదితరులు

గురుదేవోభవ

- ఎమ్మెల్యే చెవిరెడ్డి ఆధ్వర్యంలో 1,800 మంది గురువులకు సత్కారం
- తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని ఆశీర్వదించిన గురువులు
- పండుగ వాతావరణంలో ఉపాధ్యాయులకు సన్మానం

తిరుపతి రూరల్: భారతీయ సంస్కృతిలో గురువు స్థానం ఎంతో విశిష్టమైనది. సమున్నతమైనది. గౌరవప్రదమైనది. తల్లిదండ్రుల తరువాతి స్థానం గురువుది. సమాజంలో ఒక వ్యక్తి, నడకకు, నడతకు, పురోగతికి, శ్రేయస్సుకు గురువు నిర్దేశించే మార్గం తప్పనిసరి. వ్యక్తి వికాసానికైనా, దేశ వికాసానికైనా ఉత్తమ గురువు ప్రోత్సాహం, అనుగ్రహం, ఆశీర్వాదం అనివార్యం. ఒక్క మాటలో చెప్పాలంటే గురువంటే వెలిగే దీపం వంటి వారని, అంతటి గొప్పతనం కలిగిన గురువులను సత్కరించుకుకోవడం తన పూర్వజన్మ సుకృతమని తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పేర్కొన్నారు. తిరుపతి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని శ్రీనివాస ఆడిటోరియం వేదికగా శనివారం చంద్రగిరి నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యను బోధిస్తున్న 1,800 మంది గురువులను ఘనంగా సన్మానించారు. తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఒక్కొక్క ఉపాధ్యాయున్ని ఆత్మీయంగా పలుకరిస్తూ శాలువతో సత్కరించి కొత్త బట్టలు, స్వీట్లు చేతికిచ్చి వారి నుంచి ఆశీస్సులు స్వీకరించారు. గురువులను సత్కరించే బృహత్తరమైన కార్యక్రమానికి కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ, తుడా కార్యదర్శి లక్ష్మి, డీఈఓ శేఖర్ విచ్చేశారు. ముందుగా జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించిన తర్వాత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులు అర్పించారు.

గురువుకే నమస్కరిస్తా

తిరుపతిలో గోవిందుడు (శ్రీవేంకటేశ్వర స్వామి), గురువు తన కళ్లకు ఒకేసారి కనిపిస్తే ముందుగా గురువుకు నమస్కరిస్తానని తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎందుకంటే దేవుడిని పరిచయం చేసింది గురువే అన్న కబీర్ దాస్ మాటలు తనను ఎంతగానో ప్రభావితం చేశాయన్నారు. ప్రతి ఏటా ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తన నియోజకవర్గంలోని గురువులను సత్కరించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. కొన్ని అనివార్య కారణాల వల్ల ఆయన అందుబాటులో లేనందున గురువులను సత్కరించే అదృష్టం తనకు దక్కిందన్నారు. దేశ భవిష్యత్తు విద్యాలయాల్లో నిర్ణయించబడుతుందని, అందుకే గురువు తన విద్యార్థులతో ఒక స్నేహితుడిగా, వేదాంతిగా, మార్గదర్శకుడిగా ఉంటూ వారి వ్యక్తిత్వ వికాసానికి, ఎదుగుదలకు ఎంతో సహాయం చేస్తాడన్నారు.

సమాజ హితం కోరుకునే పిల్లలను తయారు చేయాలి

పరీక్షల్లో మార్కుల కోసం కాకుండా సమాజ హితం కోరుకునే విధంగా పిల్లలను తయారు చేయడమే గురువులు నిజమైన విజయంగా భావించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ సూచించారు. ప్రేమతో చెప్పే చదువు వల్లనే విద్యార్థులు బాధ్యత గల పౌరులుగా ఎదుగుతారని, చిన్నప్పుడు బాగా చదివిన వారు ఉద్యోగంలో చేరి జీవితంలో స్థిరపడతారన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ పాఠశాలల నుంచి వచ్చిన చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. గురువుల గొప్పతనాన్ని చాటిచెప్పేలా పాడిన పాటలు, దైవ భక్తిని పెంపొందించే నృత్య ప్రదర్శనలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

ఎంత మేధావి అయినా.. గురువుకు శిష్యుడే

ప్రపంచంలో ఎంత పెద్ద మేధావి అయినా ఒక గురువుకు శిష్యుడే అవుతాడని భావించిన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని గురువులను ప్రతిభతో సంబంధం లేకుండా అందరినీ ఒకేలా ఆత్మీయ సత్కారం అందించడం అభినందనీయమని కలెక్టర్ వెంకటరమణారెడ్డి కొనియాడారు. గురువులను గౌరవించడమంటే మంచి సమాజాన్ని నిర్మించుకోవడమే అవుతుందన్నారు.

ప్రాణం తీసిన కునుకు

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థుల దుర్మరణం
- వేలూరు విట్ కళాశాల ఇంజినీరింగ్ విద్యార్థులుగా గుర్తింపు
- శ్రీసిటీలో ఘటన

వరదయ్యపాళెం: కునుకు ఇద్దరి ప్రాణాలను తీసింది. ఈ ఘటన శుక్రవారం రాత్రి ప్రముఖ పారిశ్రామిక వాడ శ్రీసిటీలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు శ్రీసిటీ హైటెక్ పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు.. తమిళనాడు రాష్ట్రంలోని తిరుచ్చికి చెందిన హరీష్, దిండిగల్‌కు చెందిన రెక్సిటాస్, సేలంకు చెందిన కిషోర్, స్నేహలెండ్ వేలూరు విట్ కళాశాలలో బీటెక్ ఇంజినీరింగ్ తృతీయ సంవత్సరం చదువుతున్నారు. వీరికి శ్రీసిటీలోని ఇసుజు పరిశ్రమలో ఇంటర్న్‌షిఫ్ రావడంతో వారు గత నెలలో ఇక్కడ చేరారు. నలుగురు యువకులు శుక్రవారం రాత్రి వ్యక్తిగత పనుల నిమిత్తం సమీపంలోని తడ టౌన్‌కు కారులో వెళ్లారు. పనులు ముగించుకుని రాత్రి 12 గంటల సమయంలో తిరిగి శ్రీసిటీకి వస్తుండగా శ్రీసిటీ మార్గంలోని తొండూరు సొసైటీ కూడలి వద్ద నిద్రమత్తులో ఎడమవైపు ఉన్న చెట్టును ఢీకొట్టారు. దీంతో కారు 50 మీటర్ల దూరంలోని కాలువలోకి బోల్తా కొట్టింది. కారు నుజ్జునుజ్జు కావడంతో అందులో ప్రయాణిస్తున్న యువకుల్లో హరీష్ (19), రెక్సిటాస్ (20) అక్కడికక్కడే మృతిచెందారు. కిషోర్ (19), స్నేహలెండ్ (19) గాయాల పాలవ్వడంతో వారిని చెన్నైకి తరలించారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ అరుణ్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. శనివారం మృతదేహాలను సత్యవేడు ప్రభుత్వాస్పత్రికి తరలించి శవపంచనామా చేపట్టి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

పట్టాభిషేకం!



లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ ఆర్డర్స్‌ను అందిస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, జిల్లా కలెక్టర్, జేసీ

- 22ఏ చెర నుంచి వెంకటపతినగర్ వాసులకు విముక్తి
- దశాబ్దాల సమస్యకు శాశ్వత పరిష్కారం
- తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి
- పండుగ వాతావరణంలో లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేత
- రిజిస్ట్రేషన్స్ చేయాలని జిల్లా రిజిస్ట్రార్‌ను ఆదేశించిన కలెక్టర్



భూ సమస్యను పరిష్కరించిన తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డికి పూలతో స్వాగతం పలుకుతున్న వెంకటపతినగర్ వాసులు

తిరుపతి రూరల్: ఆస్తులున్నా అనుభవించలేని దుస్థితితో దుర్భరంగా దశాబ్దాల పాటు నరకం అనుభవిస్తున్న వారికి నిషేధిత భూముల క్రమబద్ధీకరణ చారిత్రక ఘట్టమని తుడా చైర్మన్, వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. దశాబ్దాల భూసమస్యకు శాశ్వత పరిష్కారం చూపినట్లు వెల్లడించారు. 22ఏ నిషేధిత జాబితా నుంచి తిరుపతి రూరల్ మండలం, వెంకటపతినగర్ గ్రామ భూములను తొలగించడంతో శనివారం సాయంత్రం గ్రామంలో లబ్ధిదారులకు క్రమబద్ధీకరణ ఆర్డర్ కాపీల పంపిణీ కార్యక్రమం జరిగింది. జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జేసీ బాలాజీతో కలిసి ప్రొసీడింగ్స్‌ను మోహిత్‌రెడ్డి అందించారు. 760 కుటుంబాలకు క్రయవిక్రయాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు చేసేలా అక్కడికక్కడే ల్యాప్‌టాప్‌లో అనుమతులు మంజూరు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ చిన్నియాదవ్ అధ్యక్షతన జరిగిన సభలో మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ వెంకటపతి నగరంలోని గ్రామ ప్రజలు 36 ఏళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యకు శాశ్వత పరిష్కారం దొరికిందన్నారు. రెవెన్యూ రికార్డులో ఈ గ్రామ భూమి ప్రభుత్వ భూమిగా ఉండడం వల్ల నిషేధిత భూముల జాబితాలో పెట్టారని, అందువల్ల ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ జరగలేదని తెలిపారు. ఇప్పుడు ఈ గ్రామ ప్రజలకు వారి భూములపై శాశ్వత హక్కు కల్పించి క్రయవిక్రయాలు జరుపుకునే దిశగా కృషి చేసినట్టు వెల్లడించారు.

ఎమ్మెల్యే చెవిరెడ్డి చొరవతో..

వెంకటపతినగర్ గ్రామంలో ప్రతి కుటుంబానికీ మేలు చేయాలనే తలంపుతో చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని నిషేధిత భూముల జాబితా నుంచి విముక్తి కల్పించారని కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. సదరు భూములకు శాశ్వత పరిష్కార దిశగా.. జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి ప్రొసీడింగ్స్ ఇవ్వడం జరిగిందన్నారు. 36 ఏళ్లుగా పరిష్కారం కాని భూములను రీ సర్వే చేయించి శాశ్వత పరిష్కారం చూపించామని జేసీ బాలాజీ పేర్కొన్నారు. చంద్రగిరి నియోజకవర్గ ప్రత్యేకాధికారి లక్ష్మి, తిరుపతి ఆర్డీఓ కనకనరసారెడ్డి, తిరుపతి రూరల్ తహసీల్దార్ టీవీ.సుబ్రమణ్యం, సర్పంచ్ చిన్నియాదవ్, నారాయణరెడ్డి, ఎంపీటీసీ నారాయణమ్మ పాల్గొన్నారు.

వాలీబాల్ బాలబాలికల జట్ల ఎంపిక

తిరుపతి ఎడ్యుకేషన్: ఎస్వీయూ క్యాంపస్ స్కూల్ క్రీడా మైదానంలో శనివారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో(ఎస్‌జీఎఫ్)అండర్-19 వాలీబాల్ ఉమ్మడి చిత్తూరు జిల్లా బాలబాలికల జట్ల ఎంపిక పోటీలు జరిగాయి. ఈ పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. బాలబాలికలకు వేర్వేరుగా ఎంపిక పోటీలు నిర్వహించి, ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు 16 మంది బాలురు, 16 మంది బాలికలను జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. వీరు త్వరలో నిర్వహించనున్న ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.జయరామయ్య తెలిపారు.